# అర్థం లేనిది ఆరంభం

బోడపాటి రమేష్



చెత్తకథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

బెంగుళూరులో మాధవి నడుస్తోంది. ఉదయం ఎండకు ఆమె పాదాలు మెరుస్తున్నాయి. వదులుగా అల్లుకున్న జడ, ముఖంమీద పడకలు విప్పుకున్న ముంగురులు—అందులో మూడునాలుగు నెరిసినవి, నవరంతో జడ, షిఫాన్ చీర, మాచింగ్ జాకెట్టు, పగడాల గొలుసు, మెడలో లాకెట్ ఎత్తు పైట, పైటపై లాకెట్. ఆమె చాలా అందంగా వుంది ఎదురుగా అరేబియా మహా సముద్రం. సముద్రంలో అలలు. ఉదయిస్తున్న సూర్యుడు. అలలతో పోటీపడే ఆమె అందం. చేతిలో ఇంగ్లీషు పుస్తకం.

దూరంగా తాను పార్కు చేసిన మెర్సిడెస్ బెంజీవంక తృప్తిగా చూసి నవ్వుకుంది. తనకున్న టయోటా తీసుకొస్తే పాడవుతుందని ఆమె బెంగుళూరు బీచ్‌కి తీసుకు రాలేదు పైగా స్వదేశీ వస్తువులంటే అభిమానం అందుకనే బెంజీ వాడుతుంది. ఆమెకు ఇష్టమైనవాటిల్లో ఒకటి బంగాళాఖాతంలో సూర్యాస్తమయం. ఈసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు తప్పకుండా చూడాలనుకుంది. తన ఎదురుగా అరేబియా మహా సముద్రంలో ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూస్తుండే ఆమెకు ఉన్నట్టుండి కవిత్వం పుట్టుకొచ్చింది. వెంటనే వానిటీబాగ్ తీసి అందులో కాగితాలు కనబడక. కనిపించిన వంద రూపాయల కాగితంమీద వ్రాసింది.

ఎదురుగున్న సూర్యుడా
అందమైన సూర్యుడా
నను మెచ్చే సూర్యుడా
నాకు నచ్చే సూర్యుడా
సూర్యుడా సూర్యుడా
ఓహో సూర్యుడా—అని చదువుకుని తృప్తిగా నవ్వుకుంది.

ఇంటికి వెళ్ళిన తర్వాత ఫెయిర్ చేసి ఏదయినా మాగజైన్‌కి పంపించాలనుకుంది. ఇటువంటివి వంద వ్రాసి మాధవి శతకంలా అచ్చు వేయించి, కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామికి అంకితమివ్వాలని కూడా అనుకుంది.

ఏదో నీడ. తలయెత్తి చూసిన ఆమెకు ఎవరో ఫారినర్ కనబడ్డాడు. ఆమెను చూసి నవ్వాడు. ఆమె కవిత్వం చదివాడు. ఆమెను ఏదో అడిగాడు. ఏ భాషో అర్థం కాలేదు ఆమె తెలుగులో ఏదో చెప్పింది. చూపులో చూపు కలిపింది. అతను ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. అతని కౌగిట్లో వదిగిపోయింది. దూరంగా కలకత్తా లైట్‌హౌస్ కనిపిస్తోంది. కొంత సేపటికి ఆమె తేరుకుంది. చీర సర్దుకుంది. ఆమె చుట్టూ మనుషులు. కళ్ళల్లో ఆశ్చర్యం! ఫారినర్ కనబడలేదు.

కూతురు మార్నింగ్ వాక్‌కు వెళ్ళి ఈవినింగైనా రాలేదని ఆమె తండ్రి టయోటాలో వచ్చారు. చీకట్లో కారు డ్రైవర్ ఆమెను చూసి నవ్వాడు. 'డాడీ' అంటూ వాటేసుకుంది. 'డోంట్ వర్రీ బేబీ' అని కంఠం పక్కనుండి వినబడింది. తనను వాటేసుకున్నది తండ్రికాదు కారు డ్రైవర్ అని తెలియటంతోనే ఆమె ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఇంటికి వెళ్ళింది. చీకటి పడింది. ఆ రాత్రి సూర్యగ్రహణం చాలా బాగుంది.

[ఈ కథ ఇట్లా సాగుతూనే ఉంటుంది. ఇది చదివి పుస్తకం విసిరేయని వాళ్ళకి బహుమతి ఉంటుంది. ఈ కథ ఎవరినీ కించపరచడానికి వ్రాసింది కాదు. కేవలం సరదా ప్రయోగం]

✳

పప్పండి —మల్లిక్

